


**వనం నాగయ్య, కెరటం న్యూస్**

భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ఈ నెల 17వ తేదీన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటిఆర్) ఖమ్మం జిల్లాలో పర్యటించ నున్నారు. పార్టీ అధినేత కేసిఆర్ ఆదేశాల మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నూతన ఇంచార్జ్‌గా నియమితులైన పార్టీ సీనియర్ నాయకులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు నేడు జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో స్థానిక శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్ పాల్గొన్నారు. తక్కెళ్లపల్లి రవీందర్ రావు మీడియాతో మాట్లాడుతూ, పార్టీని బూత్ స్థాయి నుండి అత్యంత పటిష్టంగా నిర్మించే ప్రక్రియలో భాగంగా ఈ పర్యటన ఖరారైందని తెలిపారు. 17వ తేదీ ఉదయం 11:00 గంటలకు పాలేరు నియోజకవర్గ పరిధిలోని 'శ్రీహర్ష కన్వెన్షన్' (ఎంట్రన్స్ క్రాస్ రోడ్) నందు నిర్వహించబోయే నియోజకవర్గ ముఖ్య ప్రతినిధుల సమన్వయ కమిటీ సమావేశానికి కేటిఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. పాలేరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి నాయకత్వం లో ఈ కార్యక్రమం అత్యంత పద్ధతిగా జరగబోతుందని, ఉమ్మడి జిల్లాలోని 10 నియోజకవర్గాల ఇంచార్జ్‌లు, రాష్ట్ర పార్టీ నియమించిన ప్రత్యేక ఇంచార్జ్‌లు మరియు జిల్లా ముఖ్య నాయకులందరూ దీనికి హాజరవుతారని స్పష్టం చేశారు. ఈ సమావేశం సాధారణ భారీ బహిరంగ సభ కాదు. ఇది కేవలం ఎంపిక చేసిన బూత్ స్థాయి ప్రతినిధులు (291 మంది బిఎల్ఏలు), డిజిటల్ మెంబర్‌షిప్ ఇంచార్జ్‌లు (బూత్‌కు ఇద్దరి చొప్పున), మరియు నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులతో (మొత్తం 1000 మంది లోపు) కూడిన ప్రత్యేక "శిక్షణ శిబిరం". కావున ఉమ్మడి జిల్లాలోని ఇతర నియోజకవర్గాల కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఇబ్బంది కలిగించవద్దని కోరారు.

**100% డిజిటలైజ్డ్ సభ్యత్వ నమోదు - సరికొత్త యాప్ ల్యాంచ్**

గతంలో ఇళ్లలోనే కూర్చుని సభ్యత్వాలు చేశారనే అపవాదులకు తావులేకుండా, ఈసారి అత్యంత పారదర్శకంగా "రాశి కంటే వాసి ముఖ్యం" అనే నినా దం తో 100% డిజిటలైజ్డ్ సభ్యత్వ నమోదు ప్రక్రియను చేపట్టబోతున్నట్లు రవీందర్ రావు ప్రకటించారు. రాబోయే రెండు మూడు రోజుల్లోనే పార్టీ అధినేత కేసిఆర్ చేతుల మీదుగా ప్రత్యేక మొబైల్ యాప్ లాంచ్ కానుంది. ప్రతి బూత్ నుండి ఎంపిక చేసిన ఇద్దరు డిజిటల్ సభ్యత్వ ఇంచార్జ్‌లు ప్రతి ఇంటికి స్వయంగా వెళ్లి, కార్యకర్తల లైవ్ ఫోటో మరియు లొకేషన్ స్నాప్‌ను యాప్‌లో




నమోదు చేస్తారు. సభ్యత్వ రుసుమును కూడా ఆన్‌లైన్ ద్వారానే స్వీకరించి, తక్షణమే ఐడీ కార్డ్ మోడల్‌లో డిజిటల్ రశీదును అందజేయడం జరుగుతుంది. ఈ ప్రక్రియను పర్యవేక్షించడానికి ప్రతి మండలానికి ఐదుగురు సభ్యుల తో కూడిన సమన్వ య కమిటీలను నియ మించడం జరిగింది.

**ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణపై బిఆర్ఎస్ అప్రమత్తత**

కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిపాదించిన ఓటర్ జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ పై బిఆర్ఎస్ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని పార్టీ పిలుపునిచ్చింది. ఈ ప్రక్రియ జూన్ 25 నుండి జూలై 25 వరకు నెల రోజుల పాటు సాగనుండగా, జూలై 31 లోపు ఫామ్-8 ద్వారా కొత్త ఓట్ల నమోదు లేదా సవరణలు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మాట్లాడుతూ, "మాకు ఎస్ఐఆర్ ప్రక్రియ పట్ల ఎలాంటి వ్యతిరేకత లేదు కానీ, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కొన్ని అనుమానాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనుల సీజన్ వల్ల ప్రజలు ఇళ్ల వద్ద ఉండని సమ యంలో, బిఎల్ఓలు మూడు సార్లు వచ్చి ఇళ్లకు తాళాలు ఉంటే ఓట్లను తొలగించే ప్రమాదం ఉంది. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించి, వారి పిల్లల ఓట్లను తొలగించే రాజకీయ కుట్ర కోణం ఏమైనా ఉంటే బిఆర్ఎస్ పార్టీ తీవ్రం గా అడ్డుకుంటుంది. అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించబడకూడదు, అదే సమయంలో అక్రమ లేదా డబుల్ ఓట్లు ఉండకూడదన్నదే మా విధానం. 2002 తర్వాత జరుగుతున్న ఈ అతి పెద్ద ఎస్ఐఆర్ ప్రక్రియపైప్రజలను, పార్టీ శ్రేణులను చైతన్యపరచడానికి పాలేరు వేదికగా కేటిఆర్ దిశానిర్దేశం చేయనున్నారు" అని పేర్కొన్నారు. ఈ ప్రజాస్వామ్య క్రతువులో ఓటరు జాబితా సవరణపై జూన్ 25 లోపు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, అక్రమ ఓట్ల తొలగింపులను నిలువరించేలా మీడియా మిత్రులు కూడా బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని ఈ సమావేశం ద్వారా విజ్ఞప్తి చేశారు. బూత్ కమిటీలు, గ్రామ, మండల, జిల్లా అనుబంధ కమిటీలన్నింటినీ హైదరాబాద్ నుంచి వచ్చే ప్రత్యేక బృం దాల పర్యవేక్షణలో అత్యంత పక డ్బందీగా పూర్తి చేస్తామని నాయకత్వం స్పష్టం చేసింది. మీడియా సమావేశం అనంతరం ఇంచార్జి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీంద్ర రావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మరియు తదితర ముఖ్య నాయకులతో కలిసి మీటింగ్ వేదికను కూడా పరిశీలించినారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, వేముల వీరయ్య, నాయకు లు బిచ్చాల తిరుమలరావు, మొర్రి మేకల నాగేశ్వర రావు, కోటి సైదిరెడ్డి, బంక మల్లయ్య, బలుసు మురళీకృష్ణ, మహమ్మద్ రఫీ, పేరం వెంకటేశ్వర్లు, నెమలికొండ వంశీ, పటేటి సాయి మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



